## మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి

### సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి

**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి:** మావోయిస్టుపై ఏకపక్షంగా మిలటరీదాడులు ఆపి శాంతిచర్చలు జరపాలని సిపిఐ జిల్లీఆ సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఒక భావజాలాన్ని తుడిచిపెట్టేయాలని దురుద్దేశంతో మావోయిస్టులపై అత్యంత అధునాతన ఆయుధాలతో ఆపరేషన్ కగార్ పేరుతో ఏకపక్షంగా అనేక మంది మావోయిస్టు అగ్రనాయకులను ఎన్‌కౌంటర్ పేరుతో హతమార్చడాన్ని సిపిఐ తీవ్రంగా ఖండిస్తోందని, తక్షణమే ఆపరేషన్ కగార్ ఆపివేయాలని సుధాకర్‌రెడ్డి ప్రకటనలో పేర్కొన్నారు. మావోయిస్టులది ఈ దేశంలో శాంతి భద్రతల సమస్యగా చూడకుండా దాన్ని సామాజిక ఆర్థిక కోణంలో చూసి, మావోయిస్టులు కోరుతున్నట్లుగా శాంతి చర్చలు జరిపి వారిని జనజీవన స్రవంతిలోకి కేంద్రం ఆహ్వానించాలని ఆయన డిమాండ్ చేశారు.

## ఘనంగా భాగ్యరెడ్డి వర్మ జయంతి



**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి:** దళిత వైతాళికుడుగా ప్రసిద్దిచెందిన సంఘ సంస్కర్త ఆది ఆంధ్రసభ స్థాపకుడు భాగ్యరెడ్డి వర్మ జయంతి సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ములుగు జిల్లా ఎస్‌పి డాక్టర్ శబరీష్ ఐపిఎస్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. జిల్లా ఎస్‌పి మాట్లాడుతూ హైదరాబాద్ సంస్థానంలో భాగ్యరెడ్డివర్మ దళితుల విద్యాభివృద్ధి కోసం, వారి అభ్యున్నతి కోసం, సామాజిక సమానత్వం కోసం గట్టి పునాదులు వేశారన్నారు. భాగ్యరెడ్డి వర్మ జీవితం ఆయన ఆశయాలు నేటి తరానికి మార్గదర్శకంగా నిలుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో డిపిఒ సూపరింటిండెంట్ శ్రీనివాస్, ఆర్ఐలు స్వామి, సంతోష్, వెంకటనారాయణ, ఎస్ఐ జగదీష్, ఆర్ఎస్ఐ సంపత్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

## హన్మకొండ ఎసిపిగా నరసింహారావు



**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు హన్మకొండ డివిజన్ నూతన ఎసిపిగా నరసింహారావు గురువారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం వరంగల్ సిపి సన్ ప్రీత్ సింగ్‌ను పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఎసిపి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలను అందజేశారు. 1995 ఎస్ఐ బ్యాచ్‌కు చెందిన నరసింహారావు గతంలో హన్మకొండ, జనగామ, నర్సంపేట ఇన్‌స్పెక్టర్‌గా పనిచేశారు.

## ధాన్యం కొనుగోలు సమస్యల పరిష్కారానికి టోల్ ఫ్రీనెంబర్‌కు కాల్ చేయాలి

### వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి:** జిల్లాలో ధాన్యం కొనుగోలు చేసే సమయంలో ఉత్పన్నమయ్యే సమస్యల పరిష్కారానికి కాల్ సెంటర్ ను ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఒక ప్రకటనలో తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ, ధాన్యం సేకరణ, రవాణా, మద్దతు ధర, సమాచారం కోసం, ఇతర ఫిర్యాదులు, ఇబ్బందుల పరిష్కారానికి రైతులు తమ సమస్యలను టోల్ ఫ్రీ నెం.18004253424 నెంబర్‌కు ఫోన్ చేయవచ్చన్నారు. దాన్యం కొనుగోలు ప్రక్రియ, రవాణా వంటి అంశాల్లో సమస్య ఉత్పన్నమైతే వెంటనే ఫిర్యాదు చేయాలని కలెక్టర్ తెలిపారు. రైతులు ఈ కాల్ సెంటర్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## డిగ్రీ కళాశాల ఆవరణలో ట్యాంక్ నిర్మాణ ప్రయత్నం నిలిపివేయాలి



**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి:** ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణ లో మున్సిపాలిటీ అధికారులు నీటి ట్యాంకర్ నిర్మాణం కోసం చేస్తున్న ప్రయత్నాలను నిలిపివేయాలని ప్రభుత్వ డిగ్రీకళాశాల సిపిడిసి కమిటి ఏకగ్రీవంగా తీర్మానించింది. మహబూబాబాద్ నూకల రామచంద్రరెడ్డి ప్రభు త్వ డిగ్రీ కళాశాల అటానమస్‌లో కాలేజి ప్లానింగ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్(సిపిడిసి) సమావేశం గురువారం ప్రిన్సిపాల్ డాక్టర్ బి.లక్ష్మ ణ్‌నాయక్ అధ్యక్షతన జరిగింది. కమిటీ సభ్యులు మహబూబాబాద్ మున్సిపల్ మాజీ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రాంమోహన్ రెడ్డి, ప్రభుత్వ ఆసుపత్రి ఆర్ఎంఓ బానోత్ జగదీశ్వర్, సిపిఐ నాయకులు అజయ్‌సారథిరెడ్డి, బిఆర్ఎస్ నాయకులు రంగారెడ్డి, మాజీ కళాశాల ప్రిన్సిపాల్ రంగారెడ్డి, న్యాయవాది దర్శనం రామకృష్ణ ఏకగ్రీవంగా తీర్మానించారు. మున్సిపాలిటీ అధికారుల నిర్ణయాన్ని కమిటి తిరస్కరించారు. ఈ సమావేశానికి కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ శ్రీనివాసులు, ఏక్యూఏసి కోఆర్డినేటర్ జూపూడి అనిల్ కుమార్,అధ్యాపక బృందం హాజరయ్యారు.

## తడిసిన ధాన్యాని ప్రభుత్వం కొనుగోలుచేయాలి



**ప్రజాపక్షం/ నర్సంపేట :** అకాల వర్షంతో తడిసిన ధాన్యాన్ని బాయిల్డ్ రైస్‌గా పరిగణించి ప్రభుత్వం కొనుగో లు చేయాలని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మంత్రిని కోరారు. గురువారం హైదరాబాద్‌లోని పౌర సరఫరాలశాఖమంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మా ధవ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంటలపై వివరించి, లిఖిత పూర్వకంగా వినతిపత్రాన్ని అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో అకాల వర్షంతో దాదాపు 4 వేల మెట్రిక్ టన్నుల ధా న్యం తడిసిందని, ఆ ధాన్యాన్ని బాయిల్డ్ రైస్ గా పరిగణించి ప్రభుత్వం కొ నుగోలు చేసి రైతులను ఆదుకోవాలని మంత్రిని కోరారు. మంత్రి సానుకూలంగా స్పందించారు. నర్సంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, వరంగల్ జిల్లా కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షుడు బొంపెల్లి దేవేందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో భారీగా చేరికలు



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** గ్రేటర్ వరంగల్ లోని 58వ డివిజన్ ప్రెసిడెంట్ తాల్లపల్లి సుధాకర్, రవిందర్,మేరి, ప్రసన్న, మండల సమ్మయ్య ఆధ్వర్యంలో బిఆర్ఎస్ నుండి డివిజన్‌కి సంబంధించిన ముఖ్య నాయకులు కార్యకర్తలు పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగింది. ఈ సందర్బంగా 58వ డివిజన్ యూత్ నాయకులు నల్ల పవన్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి పనులు, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధి పట్ల చూపుతున్న చొరవ చూసి మేమందరం బిఆర్ఎస్ నుండి కాంగ్రెస్ పార్టీలో చేరడం సంతోషంగా ఉందని అన్నారు. ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ కార్యకర్తలందరిని కంటికి రెప్పలా కాపాడుకుంటానని, ఎల్ల వేలలా అందుబాటులో ఉంటానని వారికి హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీలో నల్ల పవన్ తో పాటు తాల్ల పల్లి చంటి, నల్ల దయాకర్, తాల్లపల్లి రాకే ష్, ఇమ్మడి వినయ్, ఎండి ఆరీఫ్, రాజరపు భార్గవ్, ఎసుపాదం, నల్ల ఏలి య, నల్ల రాజేందర్ సహా దాదాపు వందమంది కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు.

## అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

**ప్రజాపక్షం/గూడూరు:** మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం గుండెంగా గ్రామ సమీపంలోని బావిలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం గుండెగ గ్రామానికి చెందిన తేజావత్ బద్రు మంగళవారం సాయంత్రం అదృశ్యమయ్యారని ఆయన భార్య తేజావత్ నీల గూడూరు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయగా పోలీసులు మిస్సింగ్ కేసుగా నమోదు చేసుకొని దర్యాప్తు కొనసాగిస్తుండగా ఈరోజు ఉదయం గుండెంగా గ్రామంలోని వ్యవసాయ బావిలో అనుమానాస్పద స్థితిలో శవమై కనిపించాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని విచారణ జరుపుతుండగా కుటుంబ సభ్యులు గ్రామస్తులు ఇది ముమ్మాటికి హత్యేనని హత్య చేసి బావిలో వేశారని నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆరోపిస్తున్నారు. అయితే కుంటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం సాయంత్రం దావత్ ఉందని చెప్పి కొంతమందితో బయటికి వెళ్లాడని వారేనా భర్తను చంపి బావిలో వేశారని వెంటనే వారిపై కఠిన చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. గూడూరు నెక్కొండ చెన్నారావుపేట ఇద్దరు సిఐలు నలుగురు ఎస్సైలు భారి బందోబస్తుతో నర్సంపేట ప్రభుత్వ ఆసుపత్రి మృతి దేహాన్ని తరలించి పోస్టుమార్టం నిమిత్తం పంపడం జరిగింది ,గూడూరు సీఐ సూర్య ప్రకాశ్ ఎస్సై గిరిదర్‌రెడ్డి కేసు పై దర్యాప్తు చేస్తున్నామని వెల్లడించారు.

# అమృత్ భారత్‌లో వేగంగా రైల్వేస్టేషన్ల అభివృద్ధి

### కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ





**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** దేశ వ్యాప్తంగా అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా అభివృద్ధి చేసిన దాదాపు 103 రైల్వే స్టేషన్లను ఘనంగా ప్రారంభించుకోవడం జరిగిందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. గురువారం పునరుద్ధరించిన వరంగల్ రైల్వేస్టేషన్‌ను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా రూ. 25.41 కోట్లతో పునరాభివృద్ధి చేసిన వరంగల్ రైల్వే స్టేషన్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హాజరైయ్యారు. ఈ సందర్భంగా పొంగులేటితో బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్ నగర్ పార్లమెంట్ సభ్యురాలు డికె అరుణ, బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యులు మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్, వరంగల్ ఎంపి కడియం కావ్యతో కలిసి కేంద్ర మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ మాట్లాడుతూ భారత ప్రధానిగా నరేంద్ర మోదీ బాధ్యతలు చేపట్టాక భారతదేశాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్లడానికి తీవ్ర కృషి చేస్తున్నారని, అందులో భాగంగా రైల్వే శాఖను అభివృద్ధి చేయాలనే దృఢ సంకల్పంతో నరేంద్ర మోదీ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రంలో మూడు రైల్వే స్టేషన్లను నూతన హంగులతో అన్ని సౌకర్యాలతో ఏర్పాటు చేశామన్నారు. రైల్వేస్టేషన్‌లో అమృత్ భారత్ రైల్వే స్టేషన్ పథకం ద్వారా సామాన్యులందరికీ అన్ని సదుపాయాలని కల్పించే విధంగా రైల్వేస్టేషన్ పునరుద్ధరించారని అన్నారు. 2014కు ముందు రైల్వే బడ్జెట్కు కేటాయించి న బడ్జెట్ కంటే ఇప్పుడు కేటాయించిన బడ్జెట్ చాలా ఎక్కువ అని, కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి వైపు నడిపిస్తున్న నేపథ్యంలో ప్రజలు నాయకత్వాన్ని అభినందించాల్సిన అవసరం ఉందన్నారు. పార్లమెంట్ సభ్యులు డి.కె. అరుణ, ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ ఎంత వేగంగా అభివృద్ధి చెందుతుందో దానికి సజీవ సాక్ష్యం ఈరోజు పునఃప్రారంభమైన మన వరంగల్ రైల్వే స్టేషన్ అన్నారు. ఎయిర్పోర్టులను తలపించే పద్ధతిలో రైల్వే స్టేషన్‌లు అభివృద్ధి చెందుతున్నాయన్నారు.స్వాతంత్రం వచ్చినప్పుడు నుండి 2014 వరకు ఎంత అభివృద్ధి జరిగిందో ఈ పది సంవత్సరాల కాలంలో అంతకంటే వేగంగా అభివృద్ధి చెందుతుంది అని చెప్పడానికి సజీవ సాక్ష్యం పునఃప్రారంభమైన బేగంపేట్, కరీంనగర్, వరంగల్ తదితర 103 రైల్వే స్టేషన్లు అన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వర్దన్నపేట ఎమ్మెల్యే కేఆర్ .నాగరాజు, ఎమ్మెల్సీలు బండా ప్రకాష్, బస్వరాజు సారయ్య, నగర మేయర్ గుండు సుధారాణి, వరంగల్ కలెక్టర్ సత్య శారధ, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్ రెడ్డి, బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, మాజీ శాసనసభ్యులు రాష్ట్ర క్రమశిక్షణ సంఘ చైర్మన్ మార్తినేని ధర్మారావు, మాజీ పార్లమెంట్ సభ్యులు అజ్మీర సీతారాం నాయక్, వన్నాల శ్రీరాములు, డాక్టర్ టి రాజేశ్వరరావు ఉమ్మడి బిజెపి జిల్లా అధ్యక్షులు, మాజీ అధ్యక్షులు, రైల్వే అధికారులు, కాంగ్రెస్, బిజెపి రాష్ట్ర, జిల్లా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

### బికెయంయు జాతీయ కార్యవర్గ సభ్యుడు వెంకట్రాములు

**ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి :** ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న అకాల వర్షాలు, గాదుపు, దుమారాలతో ప్రకృతి బీభత్సంతో నష్టపోయిన రైతులనందరిని ప్రభుత్వం ఆదుకోవాలని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు ప్రభుత్వాన్నిడిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్నో వ్యయ ప్రయాసాల కోర్చి రైతులు, కూలీలు ఆరుగాలం శ్రమించి, రక్తాన్ని చెమటగా మార్చి కష్టించి పండించిన పంటలు అకాల వర్షానికి ధాన్యం తడిసి ముద్దయిపోవడం జరిగిందన్నారు. కొన్ని చోట్ల వరదల్లో ధాన్యం కొట్టుకుపోవడంతో రైతుల పాలిట శాపంగా మారిందన్నారు. వివిధ కొనుగోలు కేంద్రాల్లో తాడిపత్రిలు, గన్నీ సంచులు ఇవ్వకుండా ఆలస్యం చేయడం వలన కాంటాలు వేయకపోవడంతో రైతులు తీవ్రంగా న ష్టపోయి కన్నీరుమున్నీరుగా విలపించే దౌర్భాగ్య పరిస్థితి దాపురించిందన్నారు. వారి కుటుంబాలకు రూ.20 ల క్షలు ఎక్స్ గ్రేషియో ఇచ్చి ఆదుకోవాలని, పిడుగులు పడి పాడి గేదెలు, గొర్రెలు,మేకలు, కోళ్లు మరణించాయని ఆ కుటుంబాల వారికి నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## సిట్టింగ్ జడ్జిచే ఎన్‌కౌంటర్ విచారణ జరిపించాలి

### ప్రజాసంఘాల నాయకులు డిమాండ్



**ప్రజాపక్షం/హనుమకొండ :** ఆపరేషన్ కగార్లో భాగంగా చత్తీస్ ఘడ్ రాష్ట్రం, నారాయణపూర్ జిల్లా, అమూజ్ మడ్ ప్రాంతంలో జరిగిన ఎన్ కౌంటర్ సిట్టింగ్ జడ్జిచే విచారణ జరిపించాలని, ఆపరేషన్ కగారు నిలిపివేసి శాంతి చర్చలు కొనసాగించాలని పలు ప్రజా సంఘాలు గురువారం హనుమకొండ అంబేద్కర్‌సెంటర్‌లో నిరసన ధర్న నిర్వహించాయి. ఈ సందర్భంగా పలువురు ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆపరేషన్ కగార్ పేరుతో గత ఏడాది జనవరి నుండి నేటి వరకు 486 పైగా అమాయక ఆదివాసులు, మావోయిస్టులను ఎన్ కౌంటర్ రూపంలో కాల్చి వేశారని ఇవి అమాయక ప్రజలపై సామూహిక హత్యకాండ అని అన్నారు. అమాయకులు అప్రజాస్వామికంగా ఎన్ కౌంటర్ రూపంలో చంపబడుతున్నారని, దీనిని ప్రజలు, ప్రజాస్వామికవాదులు, మేధావులు, సామాజిన వేత్తలు వ్యతిరేఖంచాలన్నారు.ఒకవైపు మావోయిస్టు పార్టీ తను కాల్పులను విరమిస్తూ శాంతి చర్చలకు సిద్ధమని అనేక పర్యాయాలు లేఖలు, వీడియోల ద్వారా విజ్ఞప్తి చేసినా కానీ కేంద్ర ప్రభుత్వం అందరి విజ్ఞప్తిని, మేధావుల శాంతి చర్చల కమిటీ ప్రతిపాదనలను విస్మరిస్తూ నేటికీ కగార్ పేరుతో హత్యాకాండ కొనసాగిస్తున్నదని, ఇందులో భాగంగా చత్తీస్ ఘడ్ రాష్ట్రంలోని నారాయణపూర్ జిల్లాలో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావుతో పాటు 28 మంది ఎన్కౌంటర్ రూపంలో పొత్య గావింపబడ్డారన్నారు. ఇది ఎన్ కౌంటర్ కాదు అని, ఏకపక్షంగా పట్టుకొని కాల్చి చంపినట్లుగా అర్థమవుతున్నదని, దీనిపై సిట్టింగ్ జడ్జిచే న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పౌరహక్కుల సంఘం, తెలంగాణ ప్రజాఫ్రంట్, భారత్ బచావో, న్యూడెమక్రసి, పిడిఎస్‌యు, పౌరస్పందన వేదిక,డిఎస్‌ఎ, ఆదివాసి హక్కుల పోరాట సమితి తదితర సంఘాల నాయకులు పి.రమేష్ చందర్, బి.రమాదేవి, జనుగాని కుమార స్వామి, సారంగపాణి, ఓంబ్రహ్మం, దొమ్మాటి ప్రవీణ్ కుమార్, మహేష్, ఎండి రాజ్ మహ్మద్, రాజేందర్, క్రాంతి, శంకర్ రావు, జ్యోతి, ఉదయ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలి



**ప్రజాపక్షం/ నర్సంపేట:** సిపిఐ మావోయిస్టు పార్టీ జాతీయ కార్యదర్శి నంబాల కేశవరావు మృతిపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జిచే న్యాయ విచారణ జరిపించాలి, ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని సిపిఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు అక్క పెల్లి రమేష్, తెలంగాణ ప్రజా ఫ్రంట్ వరంగ ల్ హనుమకొండ జిల్లాల అధ్యక్షుడు జనగాం కుమార స్వామి సిపిఎం పార్టీ బాధ్యుడు బాలకృష్ణ, న్యూడెమోక్రసీ నాయకులు ఎలకంటి రాజేందర్, తెలంగాణ విద్యావంతుల వేదిక నాయకులు సాంబరాతి మల్లేశంలు డిమాండ్ చేశారు. నర్సంపేటపట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో విప్లవ, వామపక్ష, ప్రజా ఫ్రంట్, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈసందర్బంగా వారు మాట్లాడుతూ సిపిఐ మావోయిస్టు పార్టీ జాతీయ కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ గంగన్నది బూటకపు ఎన్కౌంటర్‌ని, ఆరోగ్యం బాగాలేక వైద్యం కోసం పోయినటువంటి కేశవరావు సజీవంగా పట్టుకొచ్చి, చతీస్‌ఘడ్‌లో బూటకపు ఎన్‌కౌంటర్ పేరుతో హత్య చేయడం దుర్మార్గమైనటువంటి చర్య అన్నారు. మధ్యభారతంలోని ఆదివాసి గిరిజన సమాజాన్ని లేకుండా చేయాలనే ఒక దుర్బుద్ధితో ఆదివాసీ ప్రాంతంలో లభ్యమవుతున్న కోట్లాది రూపాయల అటవీ సంపదలు దేశంలో కార్పొరేట్ బహుళజాతి కంపెనీలకు కట్టబెట్టడం కోసం చతీస్‌ఘడ్‌లో నరిమేదాన్ని సృష్టిస్తున్నారని, ఆదివాసీ సమాజాన్ని కాపాడుతూ ఆదివాసి ప్రాంతంలో లభ్యమవుతున్న ఖనిజ సంపదను ఆదివాసీ ప్రాంతాలకు కేటాయించాలని పోరాటాలు నిర్వహిస్తున్న ప్రజాస్వామిక వాదులని విప్లవ పార్టీ అయినటువంటి మావోయిస్టు పార్టీని నిర్మూలన చేయాలనే ఉద్దేశంతోటి ఆపరేషన్ కంగారును కొనసాగిస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ డివిజన్ నాయకులు జక్కుల తిరుపతి, కృష్ణ, ఐఎఫ్‌టియు జిల్లా కోశాధికారి గొర్రె ప్రదీప్, పివైఎల్ జిల్లా అధ్యక్షులు ఆకుల వెంకట స్వామి, పిఓడబ్ల్యు జిల్లా ప్రధాన కార్యదర్శి పూ లక్క, అశోక్, వీరస్వామి, మల్లయ్య, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గొంపల్లి మునీశ్వర్, మహిళా సమైక్య జిల్లా అధ్యక్షురాలు పాలక కవిత, ఏవైఎఫ్ జిల్లా నాయకులు నాగరాజు, ప్రజా ఫ్రంట్ డివిజన్ నాయకులు కందికొండ కుమార్, సాంబరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ధరల అదుపులో కేంద్ర ప్రభుత్వం విఫలం

### సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఓదెలు



**ప్రజాపక్షం/దామెర :** నిత్యావసర ధరల అదుపులో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నకిర్త ఓదెలు అన్నారు. దామెర మండల కేంద్రంలో పోచమ్మగుడి ఆవరణలో సిపిఐ రెండవ మండల మహాసభ చల్ల అశోక్ అధ్యక్షతన జరిగింది. ఈ సభకు ముఖ్య అతిథిగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నకిర్త ఓదెలు హాజరై మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్నటువంటి పార్టీ అని, తెలంగాణ రావటంలో ముఖ్య పాత్ర పోషించిందని అన్నారు. దేశంలో ఒకపక్క నిత్యావసర వస్తువులు పెరుగుతూ పోతున్నాయని, ప్రజలకు ప్రభుత్వ పథకాలు ఏమాత్రం అందకుండా పోతున్నాయని అన్నారు. జిల్లాలో కమ్యూనిస్టులు చేస్తున్న పోరాటాల వల్లనే ప్రజలకు కొన్ని అయిన సంక్షేమ పథకాలు అందుతున్నాయని, ముఖ్యంగా ప్రజల సమస్యల పరిష్కారం కాకుండా ధనికులు మరింత ధనికులుగా పేదలు మరింత పేదలుగా మారుతున్న ఈ అంతరాలు పోవాలంటే ప్రజల తరపున కమ్యూనిస్టులు పోరాడాలని అన్నారు. సిపిఐ జిల్లా సమితి సభ్యులు కొట్టెపాక రవి మాట్లాడుతూ మే 26, 27 తేదీలలో హసన్ పర్తి మండల కేం ద్రంలో సిపిఐ జిల్లా రెండవ మహాసభలు జరుగుతున్నాయని, దీనికి పెద్ద సంఖ్యలో దామర మండలం నుండి తరలిరావాలని కోరారు. అనంతరం దామెర మండల నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సిపిఐ మండల కార్యదర్శిగా పుట్టపాక రవి, సహాయ కార్యదర్శిగా చల్ల అశోక్, మెరుగు సారంగపాణి, కో శాధికారిగా మిరియాల రాజు యాదవ్, కార్యవర్గ స భ్యులుగా గోపు ఐలయ్య, బొజ్జల రాజు, సింగార రాజేందర్ తో మండల కమిటీగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఎఐటియుసి జిల్లా కార్యదర్శి జ క్కు రాజు గౌడ్, బత్తిని రాజు, ప్రజానాట్యమండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆరెల్లి రవి, సుప్రియ, వసంత, వేణు, గట్టయ్య, భూషణం దాదాపు 40 మంది పాల్గొన్నారు.

# అంతర్వాహినిలో భక్తజన నీరాజనం

### 8వ రోజూ కొనసాగుతున్న భక్తుల రద్దీ



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి/కాలేశ్వరం:** తెలంగాణలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాలేశ్వర ఆలయ క్షేత్రంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న త్రివేణి సంగమంలో అంతర్వాహిని సరస్వతి నదీ పుష్కర మహోత్సవాల్లో భాగంగా గురువారం 8వ రోజు ఘనంగా కొనసాగుతోంది. గురువారం తెల్లవారుజాము నుంచే భక్తులు తో పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు. దీంతో పుష్కర ఘాట్ భక్తజన సందోహంతో కిటకిట లాడుతుంది. మన రాష్ట్రం నుండే కాక ఇతర రాష్ట్రాల నుండి పెద్ద ఎత్తున తరలి వచ్చి పుష్కర స్నానాలు ఆచరిస్తున్నారు. పుణ్యస్నానాలు, ప్రత్యేక పూజలు, హారతులతో ఘాట్‌ల పరిసరాలు భక్తిశ్రద్ధలతో మార్మోగుతున్నాయి. భక్తులు అమ్మవారి దర్శనార్థం బారీ క్యూలైన్లలో నిలబడి భక్తిని చాటుకుంటున్నారు. పుష్కర స్నానం అనంతరం కాళేశ్వర ముక్తేశ్వరున్ని దర్శించుకుని మొక్కలు సమర్పించుకుంటున్నారు. అకాల వర్షాల వల్ల భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పుష్కర స్నానానికి భద్రతా దళాలు, పో లీసు సిబ్బంది, వైద్య సిబ్బంది సహా వాలంటీర్లు సమర్థంగా సేవలందిస్తున్నారు. గత ఎనిమిది రోజులుగా కొనసాగుతున్న సరస్వతి పుష్కరాలు మిగిలిన నాలుగు రోజులు భక్తుల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో, అధికారులు అదనపు ఏర్పాట్లు చేపట్టారు. ట్రాఫిక్ నియంత్రణ, నీటి సరఫరా, విస్తృతంగా అందుబాటులో తెచ్చారు. భక్తులు పుష్కరాల్లో పాల్గొనాలని, సూచించిన మార్గదర్శకాలను పాటించాలని కలెక్టర్ రాహుల్ శర్మ విజ్ఞప్తి చేశారు.

**పుష్కరాల్లో ప్రముఖుల పుణ్యస్నానాలు, దర్శనాలు :** త్రివేణి సంగమ తీరంలో జరుగుతున్న సరస్వతి పుష్కరాలకు రాష్ట్రవ్యాప్తంగా భక్తుల సందడి ఎక్కువైంది. ప్రముఖులు ప్రముఖులు సరస్వతి నదిలో పుష్కర సనానాలు ఆచరించారు. ప్రముఖ సినీ నటుడు అల్లు అర్జున్ అర్జున్ తల్లి కాలేశ్వర క్షేత్రంలో జరిగే పుష్కరాల్లో పుణ్య స్నానం ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు. అదేవిధంగా నిజామాబాద్ శాసన సభ్యులు సత్యనారాయణ త్రివేణి సంగమంలో పుష్కర స్నానం చేసి కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. తెలంగాణ హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్య నారాయణ, కుటుంబ సభ్యులు కలిసి సరస్వతి నదిలో పుణ్యస్నానం చేసి కాళేశ్వర ముక్తేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.


## పొంగులేటిని కలిసిన ఎంపి, ఎమ్మెల్యేలు, కలెక్టర్



**ప్రజాపక్షం/హనుమకొండ :** రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వరంగల్ పర్యటనలో భాగంగా వరంగల్ ఎన్ఐటి వద్దకు చేరుకోగా వరంగల్ ఎంపి డాక్టర్ కడియం కావ్య, మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, వరంగల్ పశ్చిమ,పరకాల, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాష్ రెడ్డి, కెఆర్ నాగరాజు, కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రాం రెడ్డి, హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన ఎంపి, మేయర్, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు, కలెక్టర్ పూల మొక్కలను అందించి స్వాగతం పలికారు. ఎన్ఐటి అతిథి గృహం వద్ద మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో ఎంపి కడియం కావ్య, మేయర్ సుధారాణి, ఎమ్మెల్సీ సారయ్య, ఎమ్మెల్యేలు రాజేందర్ రెడ్డి, ప్రకాష్ రెడ్డి, కె ఆర్ నాగరాజు, జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య సమావేశమై పలు అభివృద్ధి అంశాలపై చర్చించారు

## ప్రతీ డివిజన్ అభివృద్ధి.. సంక్షేమ కార్యక్రమాలు చేపడతా...

### ఎమ్మెల్యే కెఆర్ .నాగరాజు



**ప్రజాపక్షం/హసన్‌పర్తి:** ప్రతీ డివిజన్ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను నిర్వహిస్తానని వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు అన్నారు. వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని విలీన గ్రామాల్లోని ప్రతీ కాలనీ అభివృద్ధికి ప్రత్యేకంగా అభివృద్ధి చేపడతానన్నారు. గురువారం 3వ డివిజన్ పరిధిలోని కెఎస్ఆర్ కా లనీలో నిర్మిస్తున్న అంతర్గత రోడ్లను నగర మేయర్ గుండు సుధారాణితో కలి సి ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు పనులను ప్రారంభించారు. తొలుత ఎమ్మెల్యే నాగరాజుకు కాలనీ వాసులు పుష్పగుచ్ఛం అందచేసి శాలువాతో సత్కరించి ఘన స్వాగతం పలికారు. గత పదేళ్ల బిఆర్ఎస్ ప్రభు త్వ పెద్దలను కలిసినా ఎవరూ పట్టించుకోలేదని ఎమ్మెల్యే నాగరాజు గెలుపొందిన తరువాతర మొదటిసారి వెళ్లి కలిసి సమస్య వివరించగానే సానుకూలంగా స్పందించి సుమారు రూ. కోటితో కాలనీ ప్రధాన రోడ్డు నిర్మాణం చే యించినందుకు ఎమ్మెల్యే నాగరాజుకు ప్రత్యేకంగా కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని విలీన గ్రామాల్లోని ప్రతీ కాలనీని రానున్న రోజుల్లో అన్ని విధాలుగా అభివృద్ధి చే స్తానని, సైడ్ డ్రైన్, అంతర్గత రోడ్ల నిర్మాణం కోసం ప్రజలు అధికారులకు సహకరించాలన్నారు. డివిజన్ కా ర్పొరేటర్ జన్ను శిభారాణి అనిల్‌కుమార్, స్థానిక కాలనీ అధ్యక్షుడు లాలునాయక్, డివిజన్ కాంగ్రెస్ నాయకులు బుద్దె పెద్దన్న, జన్నుసుధాకర్,అరుణాకర్,మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సేంద్రియ ఎరువులు ముద్దు..రసాయన ఎరువులు వద్దు..

**ప్రజాపక్షం/సుజాతనగర్:**రాబోవు వానాకాలానికి రైతులను సన్నద్ధం చేసే దిశగా నిర్వహిస్తున్న రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అవగాహనా కార్యక్రమంలో భాగంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల బృందం గురువారం సుజాతనగర్ మండలంలోని పాత అంజనా పురంలో పర్యటించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా వి. లక్ష్మి నారాయణమ్మ మాట్లాడుతూ పంట పొలాల్లో తక్కువ యూరియాను వాడాలని, అవసరం మేరకు రసాయనిక ఎరువులు వాడుకుంటూ సాగు ఖర్చును తగ్గించుడని, భూ మాత ఆరోగ్యాన్ని కాపాడాలని సూచించారు. ఇప్పుడు జిల్లాలో కురుస్తున్న తొలకరి వర్షాలను ఉపయోగించు కొని, పంట కాలంలో వచ్చే పురుగులు, తెగుళ్ళ ఉధృతిని తగ్గించు కోవాలని తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాస్త్రవేత్త శివ, వ్యవసాయ అధికారిణి నర్మద, ఉద్యాన అధికారిణి స్రవంతి, విస్తరణ అధికారి నరసింహారావు, వ్యవసాయ కళాశాల, అశ్వారావుపేట విద్యార్థులు, 108 మంది రైతు సోదరులు, సోదరీమణులు పాల్గొన్నారు.

## రైల్వే స్టేషన్‌లో తిరంగా ర్యాలీ

**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :**పహల్గామ్ ఉగ్రవాద దాడుల దృష్ట్యా మన సరిహద్దులను కాపాడుతున్న ఆర్మీ సిబ్బందికి మద్దతుగా, గురువారం కొత్తగూడెం డివిజనల్ మెడికల్ ఆఫీసర్ నాయకత్వంలో రైల్వే ఉద్యోగులు భద్రాచలం రోడ్ రైల్వే స్టేషన్‌లో తిరంగ ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ ఆర్‌పిఎఫ్ కృష్ణ, స్టేషన్ మాస్టర్ భద్రాచలం రోడ్ విశ్వనాథ్ ఇతర అధికారులు ర్యాలీలో పాల్గొన్నారు.



## రోడ్డు విస్తరణ పనులకు సహకరించాలి

**ప్రజాపక్షం/అశ్వారావుపేట :**అశ్వారావుపేట మున్సిపల్ పరిధిలో జరుగుతున్న రోడ్డు విస్తరణ, సెంట్రల్ లైటింగ్ పనులకు స్థానికులు, వ్యాపారులు సహకరించాలని కమీషనర్ కె.సుజాత సూచించారు. గురువారం స్థానిక సిఐ పి.నాగరాజుతో కలిసి రోడ్డు విస్తరణ పనులను పరిశీలించారు. సిపిఐ కార్యాలయంతో పాటు పలు దుకాణాలు విస్తరణ పనులకు అడ్డుగా ఉండటంతో ఆర్అండ్‌బి అధికారులు, కమీషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి వ్యాపారులకు సూచనలు చేశారు. తప్పనిసరిగా అభివృద్ధికి సహకరించాలని, ఎటువంటి ఆధారాలు ఉన్న సమర్పించాలని, అవాంతరాలు సృష్టించవద్దని, పనులు ఆగకుండా సాగేందుకు తదుపరి ప్రత్యామ్నాయ మార్గం చూస్తామన్నారు. అంతే కాకుండా పట్టణ వ్యాపారులు, చిరు వ్యాపారులు సైతం ప్రధాన డ్రైన్ వెలుపలే తమ వ్యాపార కార్యకలాపాలు చేసుకోవాలని, అందుకు అధికారులకు సహకారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్అండ్‌బి అధికారులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## దారి తప్పిన దుప్పి



**ప్రజాపక్షం/ అశ్వారావుపేట:**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో ఓ దుప్పి గురువారం హల్‌చల్ చేసింది. అటవీ ప్రాంతం నుంచి దారి తప్పి వచ్చిన ఒక చుక్కల దుప్పి అశ్వారావుపేట ఆర్టీసి బస్టాండ్ వెనుక వీధిలో స్థానికులకు కనిపించింది. దీంతో ఫొటోలు తీసేందుకు జనం ఎగబడటంతో బెదిరిపోయి పరుగులు తీసింది. తప్పించుకునే క్రమంలో ఇళ్ల మధ్య నుంచి చెంగు చెంగునా గెంతుతూ దుప్పి చేసిన ఫీట్లు చూసి స్థానికులు ఆశ్వచర్యపోయారు. బండి సుబ్రహ్మణ్యం నగర్, పేరాయిగూడెం మీదుగా అల్లిగూడెం వ్యవసాయ క్షేత్రాల వైపు దుప్పి ఊడాయించిం ది. పట్టణంలోని వీధి కుక్కల బారిన పడకుండా దుప్పి అటవీ ప్రాంతం వైపు గా సురక్షితంగా వెళ్లింది.

## సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ



**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** రైతులకు సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలను సొసైటీల ద్వారా పంపిణీ చేస్తున్నట్లు రఘునాథపాలెం మండల వ్యవసాయ అధికారి కర్నాటి ఉమామహేశ్వరరెడ్డి గురువారం తెలిపారు. మండల పరిధిలోని మంచుకొండ, రఘునాథపాలెం సొసైటీల్లో 50 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు జనుములు, జిలుగులు అందుబాటులో ఉన్నాయని ఆయన తెలిపారు. రైతులు తమ పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్‌తో సంబంధిత క్లస్టర్‌లోని వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించి కూపన్ పొందాలని ఆయన తెలిపారు. కూపన్ తీసుకుని దగ్గరలో ఉన్న సొసైటీ నుంచి విత్తనాలను కొనుగోలు చేసుకోవచ్చునన్నారు. జిలుగులు 30 కేజీల సంచి రైతులు చెల్లించాల్సిన ధర రూ. 2,138, జనుములు 40 కేజీల సంచి రూ. 2,510 అని ఆయన తెలిపారు. రైతులు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలను పొందాలన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం కలిగించేలా ప్రణాళికలు



**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** ప్రభుత్వ పాఠశాలల పై నమ్మకం కలిగించేలా ప్రణాళికలను ఉపాధ్యాయులు సిద్ధం చేసుకోవాలని నేలకొండపల్లి మండల విద్యాశాఖాధికారి బాలిన చలపతిరావు అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులలో మూడో రోజు వివిధ అంశాలపై ఉపాధ్యాయులకు శిక్షణను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులకు ఐదు రోజుల పాటు వివిధ అంశాలపై శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు శిక్షణ లో పలు అంశాలను వివరించనున్నట్లు పేర్కొన్నారు. పిల్లలలో సబ్జెక్టులో మెళుకువలు అర్ధమయ్యే రీతిలో బోధించాలని సూచించారు. చదువు కంటే ముందు వినయం విదేయుత, క్రమ శిక్షణ ను విద్యార్థులకు నేర్పించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల పై విశ్వాసం పెంచేలా ఉపాధ్యాయులు కార్యచరణ ను రూపొందించుకోవాలని సూచించారు. బడి బాట లో విద్యార్థులను చేర్పించేందుకు ముందుగా తల్లిదండ్రులకు నమ్మకం కలిగించాలని సూచించారు. రిసోర్స్ పర్సన్ ఇటిక్యాల సురేష్, వివిధ ఉపాధ్యాయుల సంఘాల ప్రతినిధులు , తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలపై ఎమ్మెల్యే పాయంకు వినతి పత్రం

**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:**మణుగూరు మండల కేంద్రంలోని ఎంఎల్ఏ క్యాంప్ కార్యాలయం ప్రజాభవన్ నందు పినపాక ఎంఎల్ఏ పాయం వెంకటేశ్వర్లు మర్యాదపూర్వకంగా కలిసి ఆళ్లపల్లి మండలం అనంతోగు గ్రామ పంచాయితీ తిర్లాపురం గ్రామంలో రైతులు పడుతున్న పలు సమస్యలు ఎంఎల్ఏ దృష్టికి తీసుకువచ్చారు. తిర్లాపురం గ్రామంలో కిన్నెరసాని వాగు అవతల ఉన్న పొలాలలో సుమారు 20 మంది రైతులు సాగు అవసరాల కొరకు బోర్లను వేయించామని అయితే ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరా లేక బోర్లు వినియోగించుకోలేకపోతున్నామని, వేసవిలో నీటి లభ్యత తగ్గిపోవడంతో సాగు పూర్తిగా ఈ బోర్లపై ఆధారపడి ఉందని, కావున ఆ ప్రాంతానికి 3 ఫేస్ విద్యుత్ సరఫరా అందించగలరని, అదే విధంగా మక్కెల కట్టు మర్రే చెరువుకు, చింతలకుంట చెరువు కి పూడికలు తీపించి రెండు చెరువుల పూర్తి మ్యాన్ సర్వే సంబంధిత అధికారులతో చూపించాలని ఎంఎల్ఏ పాయంకి వినతి పత్రం అందజేశారు తిర్లాపురం గ్రామ రైతులు.

## అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన సాబీర్ పాష



**ప్రజాపక్షం/కొత్తగూడెంటౌన్:**హనుమాన్ జయంతి సందర్భంగా గురువారం కొత్తగూడెం పట్టణంలోని రామవరం సి అర్ పి క్యాంపు వద్దగల హనుమాన్ ఆలయం కమిటీ వారు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ సాబీర్ పాషా ప్రారంభించారు. ఈ సందర్భంగా సాబీర్ పాషా మాట్లాడుతూ, గత 40 ఏళ్లుగా ఈ ఆలయ ప్రాంగణంలో కుల మతాలకు అతీతంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించటం ఎంతో అభినందనీయం అని కమిటీ వారిని అభినందించారు. భారతదేశ సర్వకుల మతాలకు నిలయంగా ఉండన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు , యూత్ సభ్యులు పాల్గొన్నారు.

# మురికి నీటి సమస్యకు ... ముగింపు లేదా?

### ఇలా ఖాళీ చేస్తారు...అలా నిండుతుంది

### ఈ దుర్వాసన ఇంకెన్నాళ్లు భరించాలి



**ప్రజాపక్షం/వైరా:**అపార్ట్‌మెంట్ మురికినీరు రోడ్లపై ప్రవహిస్తుంటే ఎన్నాళ్లు చూడాలి. ఈ మురికి నీరుకు ముగింపు లేదా అని వాదన రోజురోజుకు బలపడుతుంది. గంధం టవర్ వద్ద ఉన్న మురికి నీరు గుంటలు నిండగానే రోడ్లపై ప్రవహిస్తూ ఉంటాయి. ఆ గుంటల నీటిని మున్సిపాల్ సిబ్బంది పోయి శుభ్రం ఖాళీ చేస్తారు. మరల గుంటలు నిండుతాయి. రోడ్లపైకి వస్తాయి. ఇది గత కొన్ని నెలలుగా జరుగుతున్న పరిస్థితి. అసలు ఈ గంధం వర్ డ్రైనేజీకి ముగింపు ఉందా లేదా? ఒక్కసారి జిల్లా కలెక్టర్ మురికిని రోడ్లపై ప్రవహించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తే సమస్య పరిష్కారం అవుతుంది. అసలు ఈ సమస్యను పరిష్కరించాల్సిన బాధ్యత ఎందుకు తీసుకోవడం లేదు. రోజురోజుకు రోడ్లపైకి దుర్వాసనతో కూడిన నీరు వస్తూనే ఉంది. రెండు రోజుల క్రితం రోడ్లపైకి భారీగా కలుషిత అపార్ట్‌మెంట్ నీరు దుర్వాసనతో ంది. మున్సిపాల్ అధికారులు ఆ గుంట నిండగానే అక్కడికి వెళతారు. వాటిని మోటార్ సాయంతో బయటకు తీస్తారు. మళ్లీ అదే పరిస్థితి ఎందుకు అపార్ట్‌మెంట్ విషయంలో పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టలేకపోతున్నారు. మున్సిపాలిటీలో 20వ వార్డుల్లో పారిశుధ్య సమస్యలు లేవా మరి వాటిని వదిలి ఒక్క అపార్ట్‌మెంట్ విషయంపైనే ఎందుకు శ్రద్ధ చూపుతున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ పూర్తిస్థాయిలో జోక్యం చేసుకొని అపార్ట్‌మెంట్ నిర్మాణం ఏ విధంగా జరిగింది. అపార్ట్‌మెంట్ నిర్మాణం ప్లాన్ అప్రూవల్ ఏ విధంగా ఇచ్చారు. డ్రైనేజ్ సమస్య పరిష్కారం లేకుండా నిర్మాణం ఎలా చేపట్టారు. దీనిపై పూర్తిస్థాయిలో దృష్టి సారిస్తే సమస్యకు పరిష్కారం దొరుకుతుంది. ఎందుకంటే ఇలా శుభ్రం చేస్తే అలా నిండి రోడ్లపై ప్రవహిస్తుంది. దీనికి బాధ్యత ఎవరిది. చుట్టుప్రక్కల ఉన్న ప్రజలు వ్యాపార సముదాయాలు ఉండాల్సిన అవసరం లేదా, వారి షాపులు ముందే మురుగునీరు ప్రవహిస్తుంటే ఎలా చూస్తూ ఉంటారు. గంధం టవర్ డ్రైనేజ్ నీరు రోడ్లపై ప్రవహించడం పట్ల పెద్ద ఎత్తున ఆందోళన చేసేందుకు ప్రజలు కూడా సిద్ధమవుతున్నట్లు సమాచారం.

## ప్రభుత్వం నిర్ణయించిన ధరకే నష్టపరిహారం

### ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్



**ప్రజాపక్షం/అశ్వారావుపేట:** సీతారామ ప్రాజెక్టు కాలువ నిర్మాణ పనుల్లో భూములు కోల్పోయిన రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన ధరకే నష్టపరిహారం చెల్లించటం జరుగుతుందని ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కాసాయి తెలిపారు. గురువారం అశ్వారావుపేట మున్సిపాల్టీతో పాటు ఊట్లపల్లి గ్రామంలో భూ సేవకరణపై గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్టు ద్వారా అశ్వారావుపేట, ఊట్లపల్లి, జమ్మిగూడెం గ్రామాల్లోని పలు చెరువులకు కాలువల ద్వారా ప్రాజెక్టు నీటిని సాగునీరుగా తరలించటం జరుగుతుందని, అందుకు రైతుల నుండి భూ సేకరణకై ఈ గ్రామ సభలు ద్వారా ఎటువంటి అభ్యంతరాలు లేకుండా భూములు తీసుకోవటం జరుగుతుందని అన్నారు. అందుకు రైతులు సహకరించాలని, ఈ మండలంలో అన్ని విధాల 8వేల ఎకరాలకు సీతారామ ప్రాజెక్టు కాలువల ద్వారా లబ్ధి చేకూరుతుందని వివరించారు. ఈ గ్రామసభలో కమీషనర్ కె.సుజాత, తహశీల్దార్ రామకృష్ణ, ఇరిగేషన్ డిఇఒకృష్ణ, ఎఇ కృష్ణ, ఆర్ఐ తాటి కృష్ణ, పద్మావతి, సొసైటీ అధ్యక్షులు చిన్నంశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## యువ కమ్యూనిస్టులకు దిక్సూచి మందడపు నాగేశ్వరరావు

### సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్




**ప్రజాపక్షం/ మధిర:**నేటి తరం కమ్యూనిస్టులకు ప్రజా నాయకుడు స్వర్గీయ మందడపు నాగేశ్వరరావు దిక్సూచి అని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ అన్నారు. పేద ప్రజల కష్టాలను గుర్తించి వారి పక్షనా నిలిచి ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్వహించటం ద్వారా మందడపు నాగేశ్వరరావు జననేతగా ఖ్యాతి పొందారని వ్యాఖ్యనించారు. గురువారం మండల పరిధిలోని మల్లవరం గ్రామంలో మాజీ సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు, మల్లవరం మాజీ ఎంపిటిసి మందడపు నాగేశ్వరరావు నాల్గొవ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా సిపిఐ నాయకులు బిసి కాలనీ, మల్లవరం సర్కిల్‌లో ఉన్న మందడపు నాగేశ్వరరావు విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మడుపల్లి లక్ష్మణ్, సట్టు అశోక్ అధ్యక్షతన జరిగిన సభలో దండి సురేష్ మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ నాయకుడిగా, మల్లవరం ఎంపిటిసిగా నాగేశ్వరరావు ఎనలేని సేవలందించారని, పేద ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం శ్రమించారన్నారు. అను నిత్యం పేదల అభ్యున్నతి, సంక్షేమం కోసం పరితపించేవాడని, ఆయనను ఆదర్శంగా తీసుకుని ఈ ప్రాంతంలో అనేక మంది కమ్యూనిస్టు పార్టీ వైపు ఆకర్షితులై ప్రజా సేవకు అంకితమై నాయకులుగా ఎదిగారన్నారు. ప్రజలను, యువ కమ్యూనిస్టులను చైతన్యవంతం చేసి ప్రశ్నించే తత్వం నేర్పించారని, ఈ ప్రాంత కమ్యూనిస్టు పార్టీ ప్రతిష్టను నాగేశ్వరరావు మరింత పెంచారన్నారు. ఈ వర్ధంతి సభలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తాటి వెంకటేశ్వరరావు, మందడపు నాగేశ్వరరావు సతీమణి రాణి, సిపిఐ మండల కార్యదర్శి ఊట్ల కొండలరావు, సిపిఐ జిల్లా నాయకులు ఎంఎ రహీం, మచ్చ వెంకటేశ్వరరావు, జల్లా బ్రహ్మం, సిపిఐ మల్లవరం గ్రామశాఖ కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనల ప్రకారమే రోడ్డు విస్తరణ పనులు



**ప్రజాపక్షం/అశ్వారావుపేట :** అశ్వారావుపేటలో జరుగుతున్న సెంట్రల్ లైటింగ్, రోడ్డు విస్తరణ ప నులు ఒక్కో చోట ఒక విధంగా అధికారులు రోడ్డు వెడల్పు పెంచుకుంటూ పోతున్నారని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సయ్యద్ సలీం, మండల కార్యదర్శి గన్నిన రామకృష్ణ ఆరోపించారు. గురువారం పనులను పరిశీలించేందుకు వచ్చిన మున్సిపాల్టీ కమీషనర్‌కు అభ్యంతరాలను వ్యక్తం చేశారు. రింగ్ రోడ్డు సెంటర్‌లో ఒకవైపు ఒకలా మరోవైపు ఒకలా రోడ్డు వెడల్పు తీయడం వల్ల అనేక మంది చిరు వ్యాపారులు నష్టపోతున్నారని, దీని వల్ల సొంత పట్టా భూములు కలిగిన అనేక మంది భవనాలను సైతం కోల్పోవాల్సి వస్తుందని, ఆర్అండ్ బిశాఖ అధికారులు ఎస్టిమేట్ నిబంధనలకు లోబడి రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని కోరారు. పోలీస్‌స్టేషన్, సిపిఐ కార్యాలయం ఇతర వ్యాపార సముదాయాలు వద్ద మధ్యలో ఉన్న రింగ్‌బండ్‌ను తొలగించి నిబంధనల ప్రకారం డ్రైనేజి పనులు చేపట్టాలన్నారు. కొందరు వ్యక్తులు, రాజకీయ నాయకుల కలల్లో ఆనందం చూసేందుకు అత్యుత్సాహం ప్రదర్శిస్తూ రింగ్‌లో ఉన్న సిపిఐ కార్యాలయం, అమరవీరుల స్థూపాలను తొలగించాలని ఉద్దేశ్యంతో కక్షకట్టినట్లు రోడ్డు వెడల్పును పెంచుతున్నారని విమర్శించారు. ఇప్పటికైనా అధికారులు నిబంధన ప్రకారం రోడ్డు వెడల్పు పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు.

## పేదల ముంగిటికి మోకాలు మార్పిడి చికిత్స



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** పేదల ముంగిటికి మోకాలు మార్పిడి చికిత్సను అందుబాటులోకి తీసుకు వచ్చామని అతి తక్కువ ఖర్చుతో మోకాలు మార్పిడి చికిత్సను అందిస్తున్నామని మమత వైద్య సంస్థల కార్యదర్శి పువ్వాడ జయశ్రీ తెలిపారు. ఇప్పటి వరకు ఆసుపత్రిలో 150 మందికి అత్యంత విజయవంతంగా మోకాలు మార్పిడి శస్త్ర చికిత్స నిర్వహించినట్లు ఆమె తెలిపారు. 150 మోకాలు మార్పిడి శస్త్ర చికిత్స విజయవంతంగా పూర్తయిన సందర్భంగా బుధవారం ఆసుపత్రిలో ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి వైద్య బృందానికి జయశ్రీ అభినందనలు తెలియజేశారు.ఈ సందర్భంగా జయశ్రీ మాట్లాడుతూ మమత వైద్య సంస్థల ద్వారా పేదలకు నిరంతరం వైద్య సాయం అందిస్తున్నట్లు తెలిపారు. నాణ్యమైన అత్యాధుక పద్ధతుల్లో మోకాలు మార్పిడి శస్త్ర చికిత్సను నిర్వహిస్తున్నామని పేదలకు అందుబాటులో కార్పొరేట్ సేవలను మమత అందిస్తుందని జయశ్రీ తెలిపారు. అన్ని రకాల వ్యాధులకు మమత సంస్థ ద్వారా పేదలకు వైద్య సాయం అందిస్తున్నామని ఆమె తెలిపారు.మమత వైద్య, విద్యా సంస్థల డైరెక్టర్ డాక్టర్ నరేన్, మమత వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అనురాధ, మమత ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామస్వామి, ఆర్థోపెడిక్ ప్రొఫెసర్ డాక్టర్ వేణుగోపాల్, సర్జన్ డాక్టర్ బాలకృష్ణ, ఆసుపత్రి ఎఒ టివి బాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## సింగరేణి ఉద్యోగంతో ఉజ్వల భవిష్యత్తుకు బాటలు

### జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్




**ప్రజాపక్షం/మణుగూరు:**మణుగూరు ఏరియా నందు సింగరేణిలో పని చేస్తూ మెడికల్ ఇన్వలిడేట్ అయిన సింగరేణి ఉద్యోగుల కుటుంబాలకు చెందిన డిపెండెంట్స్ 8 మంది అభ్యర్థులకు మణుగూరు ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ జిఎం కార్యాలయ ప్రాంగణంలో గురువారం జరిగిన ఓ కార్యక్రమంలో కారుణ్య నియామకం క్రింద సింగరేణిలో ఉద్యోగ నియామక పత్రాలు అందజేయడం జరిగినది. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ మాట్లాడుతూ సింగరేణి వంటి గొప్ప సంస్థలోఉద్యోగం దొరకడం గొప్ప అదృష్టం అన్నారు. సింగరేణి ఉద్యోగి ప్రత్యక్షంగా సంస్థ అభివృద్ధికి, తన కుటుంబ పోషణకేకాక పరోక్షంగా రాష్ట్ర ప్రగతికి కూడా దోహదపడుతాడన్నారు. కాబట్టి ఎంతో నిబద్ధతగల ఉద్యోగిగా పేరు పొంది, ఉద్యోగ విరమణతో వచ్చే లక్షల రూపాయలకంటే తమ బిడ్డల భవిష్యత్తు ముఖ్యం అని భావించి మీకు ఉద్యోగ అవకాశం కలిపించిన తల్లిదండ్రుల గొప్ప మనస్సుని స్పూర్తిగా తీసుకొని నాగాలు లేకుండా రక్షణ, క్రమశిక్షణతో విధులు నిర్వర్తిస్తూ సంస్థ పురోభివృద్ధికి పాటుపడాలి, ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జిఎం డి శ్యామ్ సుందర్, డిజిఎం (పర్సనల్) అండ్ అధికార ప్రతినిధి ఎస్. రమేశ్, ఏఐటియుసి బ్రాంచ్ సెక్రటరీ రామ్ నర్సయ్య, ఐఎన్‌టియుసి వైస్ ప్రెసిడెంట్ వి. కృష్ణం రాజు, ఏరియా సెక్యూరిటీ అధికారి కే. శ్రీనివాస్, సీనియర్ పర్సనల్ అధికారిశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## హనుమాన్ జయంతి వేడుకలకు హాజరైన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/సత్తుపల్లి:**సత్తుపల్లి పట్టణ, మండల పరిధిలోని పలు ఆలయాల్లో గురువారం హనుమాన్ జయంతి వేడుకలు ఆలయ కమిటీల ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని వేంసూరు రోడ్ లో గల శ్రీ మెట్ట ఆంజనేయ స్వామి ఆలయంలో తెల్లవారుజాము నుండి అంజన్నకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామ యజ్ఞం, లక్ష తమలపాకుల పూజార్చన, ఆలయంలో జరిగిన ప్రత్యేక హోమ కార్యక్రమాలు నిర్వహించారు. సత్తుపల్లి శాసన సభ్యురాలు డా.మట్టా రాగమయి దయానంద్ హనుమాను జయంతి వేడుకలకు హజరవ్వగా ఆలయ కమిటీ భాద్యులు, అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే డా.మట్టా హోమంలో పాల్గొని, అంజన్నకు ప్రత్యేకపూజలు నిర్వహించారు. భక్తులకు మహా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయగా అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్ మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ , తదితరులు పాల్గొన్నారు.

## బస్తీ దవాఖానా డిఎంఅండ్‌హెచ్‌ఓ తనిఖీ



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని బస్తీ దవాఖానాను జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ బి. కళావతిబాయి ఆకస్మికంగా తనిఖీ చేశారు. గురువారం నగరంలోని రంగనాయకుల గుట్ట బస్తీ దవాఖానాను డిఎం అండ్‌హెచ్‌వో కళావతిబాయి తనిఖీ చేశారు. వైద్యులు రోగులతో వ్యవహరిస్తున్న తీరును గమనించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు సిబ్బంది విధుల్లో ఉండి రోగులకు సేవలు అందించాలన్నారు. రోగులతో మంచిగా వ్యవహరించాలని అవసరమైన వారికి ల్యాబ్ పరీక్షలు నిర్వహించి మందులు అందించాలన్నారు. మలేరియా, డెంగ్యూ, క్యాన్సర్, మధుమేహం, హైపర్ టెన్షన్, టిబి వ్యాధిగ్రస్తులకు ఉత్తమ సేవలను అందించి వారికి అవగాహన కల్పించాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించవద్దని డిఎంఅండ్‌హెచ్‌ఓ సూచించారు.

# రెండు నెలల నుంచి తెరుచుకోని కార్యాలయం!

### పట్టించుకోని ఉన్నతాధికారులు..

### ఇబ్బందులు పడుతున్న రైతులు, అధికారులు..



**ప్రజాపక్షం/కల్లూరు:**కల్లూరు లోని ఎన్ఎస్‌పి కార్యాలయంలో ఉన్న ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అధికారి కార్యాలయం సుమారు గత రెండు నెలల నుంచి అధికారి లేనందున రైతులు, సంబంధిత అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ కార్యాలయం పరిధిలో తల్లాడ, కల్లూరు రెండు మండలాలు అధికారి ఇక్కడనే ఉంటారు. గత మార్చి 31వ తేదీన లక్ష్మీ నారాయణ పదవి విరమణ పొందడంతో ఆయన లేక కార్యాలయంలో అంచనాలు రెండు మండలాల పరిధిలోని సాగర్ ఆయకట్టు అంచనాలు బిల్లులు ప్రతిపాదనలు లేక ప్రభుత్వానికి పంపించే వారు లేక ఫైల్స్ నిర్వహణ పూర్తిగా నిలిచిపోయాయి. రెండు మండలాల పరిధిలోని రైతులకు సలహాలు సూచనలు కాలువ కట్ట బలహీనతలు, నిర్మాణాలు, అంచనాలు కు సంబంధించిన ప్రతిపాదనలు చేసేవారు. లేక ఫైళ్లు కదిలించేవారు లేక దుమ్ము దులిపేవారు లేకపోవడంతో ఎక్కడ ఫైల్ అక్కడే బూజు పట్టి నిలిచిపోయినట్లు అధికారుల్లో రైతుల్లో చర్చలు కొనసాగుతున్నవి. ఖరీఫ్ సీజన్ ప్రారంభించే లోగా కాలువ కట్టలకు సంబంధించిన అంచనాలు ప్రభుత్వానికి నివేదిక పంపించాలి. పంపించేవారు లేక తయారు చేసేవారు లేక అడిగే వారు లేక ఎక్కడ ఫైలు అక్కడే ఉండటంతో ఖరీఫ్ సీజన్లో రైతులు కష్టాలు పడే అవకాశం ఉంది. అధికారిని నియమించడంలో జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నట్లు వహించడంతో ఖరీఫ్ సీజన్లో ఇబ్బందులు ఎదురవుతాయని చర్చలు కొనసాగుతున్నవి తాత్కాలికంగా ఓ అధికారిని నియమించిన కూడా వారిని కూడా జీతాలు కొరకు మాత్రమే నియమించినట్లు చేసినట్లు చర్చించుకుంటున్నారు. నియామకం ఏర్పాట్లు అన్నీ కూడా గాలికి వదిలేసినట్లు అధికారుల్లోనే చర్చలు కొనసాగుతున్నవి. అదే విధంగా సర్కిల్ కార్యాలయంలో కల్లూరు డిప్యూటీ ఎస్ఈ ని ఖమ్మం ఇంచార్జ్ డిప్యూటీ చీఫ్ ఇంజనీర్‌గా నియమించడంతో కల్లూరులోని డిప్యూటీ ఎస్ ఈ రికార్డుల నిర్వహణ మొత్తం కూడా నిలిచిపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చర్చలు కొనసాగుతున్నవి. కల్లూరులోని 10 మండలాలకు సంబంధించిన ఎస్సీ కార్యాలయంలో సిబ్బంది కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు సమాచారం. ఉన్నత స్థాయి అధికారులు సమస్యను పరిష్కరించాలని అధికారులు రైతులు ఉన్నత స్థాయి అధికారులను కోరుతున్నారు.

